RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 177 | జూన్ 08, 2025 | వెల : రూ.3-00



రాజీ మార్గం రాజ మార్గం

2లో..

- ఖాకీల చేతిలో బందీలుగా పలువురు మావోయిస్టు నేతలు
- వెంటనే కోర్టులో హాజరుపరచాలి: పౌరహక్కుల సంఘం

# వారూ తూటాలకు బలేనా?




**వేద న్యూస్, డెస్క్:**

ఛత్తీస్‌గఢ్ పోలీసుల అదుపులో ఉన్న మావో యిస్ట్ నాయకులు బండి ప్రకాష్, ఎస్‌జెడ్‌సీ నాయకుడు పాపారావు, నేషనల్ పార్క్ కార్యద ర్శి దిలీప్, మద్దెడు ఏరియా కార్యదర్శి సీతు, డీసీ మెంబర్ రామన్న, మున్నా, సునీత, మహే శ్‌తో పాటు పది మంది మావోయిస్ట్ నేతలకు.. ప్రాణ హాని తలపెట్టకుండా వెంటనే కోర్టులో హాజరుపర చాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.నారా యణరావు ఓ ప్రకటన రిలీజ్ చేశారు. ఖాకీ ల అదుపులో ఉన్న వారందరూ పోలీసుల తూటా లకు బలియేనా? అని ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్.. బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలోని ఒక గ్రామంలో మావో యిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ మెంబర్ సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ మెంబర్ మైలారపు ఆడేళ్లు అలియాస్ భాస్కర్, బండి ప్రకాష్, ఎస్‌జెడ్‌సీ పాపారావు తదితరులను పోలీసులు ప్రాణాలతో పట్టు కున్నారని వెల్లడించారు. సుధాకర్, భాస్కర్ లను ఎన్‌కౌంటర్ల పేరిట హత్య చేశారని ఆరోపించారు. పోలీసుల అదుపులో ఉన్న బండి ప్రకాష్, మిగ తా మావోయిస్టు నాయకుల ను అలానే హత్య చేసే ప్రమాదముందని హెచ్చరిం చారు. ప్రాణాలతో దొరికిన మావోయిస్టు లీడర్లను ఎన్‌కౌంటర్ పేరిట హతమార్చడం రాజ్యాంగవి రుద్ధం, చట్టవ్యతిరేకమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామి కవాదులు, ప్రతిపక్ష పార్టీలు దీన్ని ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్ట్ పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు.




## 30 రోజుల్లో నాలుగో ఘటన!

### కేదార్ నాథ్ వద్ద హెలికాప్టర్ క్రాష్ ల్యాండింగ్...

**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**

ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రా మార్గంలో హెలికాప్టర్ ప్రమాదాలు కొనసాగుతున్నాయి. తాజాగా శనివారం ఉదయం కేదార్‌నాథ్‌కు యాత్రి కులను తీసుకెళుతున్న ఒక ప్రైవేట్ సంస్థకు 4లో..

## రూ.151 కోట్ల భారీ విరాళం ఇచ్చిన ముఖేశ్ అంబానీ



**వేద న్యూస్, డెస్క్:**

రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. తాను విద్యన భ్యసించిన ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐసీటీ)కి ఏకంగా 4లో..



## తెలంగాణ విమాన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

భారత రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రఖ్యాత డసో ఏవియేషన్ సంస్థ యొక్క రఫేల్ యుద్ధ విమానాల ప్రధాన భాగాలైన ఫ్యూసిలేజ్‌లు ఇకపై హైదరాబాద్‌లో తయారు కానున్నాయి. ఈ మేరకు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్), డసో ఏవియేషన్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి 4లో..

## కాళేశ్వరం వివాదంలోకి నన్ను అనవసరంగా లాగుతున్నారు

### సుమోటోగా కమిషన్ ముందుకు వెళ్లి వివరాలు అందిస్తానన్న తుమ్మల

**వేద న్యూస్, డెస్క్:**



కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలోకి తనను అనవసరంగా లాగుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అంశంపై విచారణ జరుపుతున్న కమిషన్ ఎదుట మాజీ మంత్రి ఈటల రాజేందర్ పూర్తిగా అవాస్తవాలు చెప్పారని ఆయన ఆరోపి ంచారు. ఈ వ్యవహారంలో తనపై వస్తున్న ఆరోపణలపై మంత్రి తుమ్మల శనివారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ, "కాళేశ్వరం కమిషన్ ముందు ఈటల రాజేందర్ అబద్ధాలు చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆయన అనాలో చితంగా వాంగ్మూలం ఇచ్చారా లేక అలాంటి పరిస్థితులు కల్పించారా?" అని ప్రశ్నించారు. తప్పుడు ప్రకటనలతో ప్రజలను ఎక్కువ కాలం మభ్యపెట్టలేరని హితవు పలికారు. తన హయాంలోని సబ్ కమిటీకి, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి 4లో..




## భారీ ఎన్‌కౌంటర్

### ఐదుగురు మృతి, వీరిలో ఇద్దరు ఆడవాళ్లు

**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి 4లో..

## మిల్స్ కాలనీ సీఐగా రమేష్ బాధ్యతలు స్వీకరణ




4లో..

- జనం మనసులో "బొల్లం" స్థానం పొందేనా?
- గత చరిత్రను పక్కనబెట్టి నూతన అధ్యాయం లిఖించాలని పలువురి ఆకాంక్ష

## ఏపీ గ్రీన్ కో ప్రాజెక్టు ఒక అద్భుతం

**వేద న్యూస్, ఇంటర్నెట్ డెస్క్:**



ఏపీలోని కర్నూలు జిల్లాలో నిర్మితమవుతోన్న పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టు దేశానికి, ప్రపంచానికి మార్గదర్శిలా నిలిచిందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. దీనికి ఏపీని అభినందిస్తున్నానని ఆయన అన్నారు. తెలంగాణలో సింగరేణి బొగ్గు, థర్మల్ పవర్‌తో పాటు పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ తీసుకోవాలని ఆలోచిస్తున్నామని అందుకోసమే, తెలంగాణ ప్రభుత్వం 2015 న్యూ ఎనర్జీ పాలసీ తెచ్చిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. తెలంగాణలో 2029-30 నాటికల్లా కనీసం 20 వేల మెగా వాట్స్ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి తెలిపారు. ఏపీలోని పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టును భట్టి ఇవాళ సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పాణ్యం మండలం పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉందని, రానున్న రోజుల్లో పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టు నుంచి వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేయవచ్చని ఆయన తెలిపారు. తెలంగాణలో కూడా ఇలాంటి పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు.. పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టును సందర్శించానని భట్టి

## నేను ఆపకుంటే భారత్-పాక్ మధ్య అణుయుద్ధం జరిగేది



4లో..

వేద న్యూస్

ఆదివారం జూన్ 08, 2025

# రాజీ మార్గం రాజ మార్గం

**- జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి - జమ్మికుంట టౌన్ సీఐ ఎస్.రామకృష్ణ**

**వేద న్యూస్, జమ్మికుంట:**



ఈ నెల 14న హుజూరాబాద్‌లోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో.. రాజీపడే కేసులలో రాజీపడేటట్లు ఫిర్యాది, ముద్దాయి ఇరువర్గాలకు అవకాశం ఉందని, ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట టౌన్ సీఐ ఎస్.రామకృష్ణ సూచించారు. ఇరువర్గాల మధ్య చట్ట సమ్మతమైన రీతిలో వివాదాలు పరిష్కరించడమే లోక్? అదాలత్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడ దగిన కేసుల్లో ఇరువర్గాల ఆలోచించుకోవాలన్నారు. వారి ఇష్టపూర్వకంగా చిన్నచిన్న కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని.. ఒకే కుటుంబంకు చెందిన వారు ఒకే గ్రామంలో,పట్టణంలో ఉండే వారు ఎప్పుడూ కలిసిమెలిసి ఉంటారు.. కాబట్టి రాజీ మార్గం రాజ మార్గమని సూచించారు.

# ఘనంగా పోచమ్మ బోనాలు

**వేద న్యూస్, జమ్మికుంట:**



మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంటలో శనివారం ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివ కేశవ కళాబృందం వారు కోలాటం తో, డప్పు చప్పులతో ఊరేగింపుగా పోచమ్మ తల్లి గుడికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్ నాయకులు ఆకుల రాజేందర్, రావికంటి సదాశివుడు, ఏగిత అశోక్, భోగం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


# బొడ్డు చింతలపల్లిలో ఆధ్యాత్మిక శోభ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**





వరంగల్ జిల్లా గీసుకొండ మండలం బొడ్డు చింతలపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కాకతీయ కాలంలో నిత్య పూజలు అందుకున్న దేవాలయం, యుద్ధాల కారణంగా పూర్తిగా ధ్వంసం అయిన నేపథ్యంలో బొడ్డు చింతలపల్లి గ్రామస్తులు స్వచ్ఛందంగా గ్రామంలోని ప్రజలందరూ సంఘటితమై నిర్మించుకున్న దేవాలయాల పునః ప్రతిష్ట కార్యక్రమాలు గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రోజు జరిగిన కార్యక్రమాల్లో పూజారులు పూజా కైంకర్యాలు నిర్వహించి హోమం, యాగం తదితర పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. శివరామ క్షేత్ర దేవాలయ కమిటీ నిర్వాహకులు గ్రామంలోని ప్రజలందరికీ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. సాయంత్రం సమయంలో ఆలయంలోని ఉత్సవ విగ్రహాలని గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగిస్తూ ప్రజలందరికీ దర్శనం కల్పించారు. గ్రామంలోని ప్రజలు ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొని తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. సాయంత్రం పూట జరిగిన దేవతామూర్తుల విగ్రహాలకి జలధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి నీటిని తీసుకొచ్చి ఆ విగ్రహానికి అభిషేకం చేశారు. సాయంత్రం పూట గ్రామస్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రెండో రోజు కార్యక్రమంలో ఉదయం నుంచే పూజారి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించిన పూజారులు క్షీరాధివాసం, వస్త్ర ధివాసం,



ధాన్యాధివాసం, కార్యక్రమాలను ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి కుటుంబ సభ్యుడు పూజలో పాల్గొనే విధంగా దేవాలయ కమిటీ వారు ఏర్పాట్లు చేశారు.

**- గ్రామంలో ఆధ్యాత్మిక సౌరభం**

ఆలయాల నిర్మాణం పూర్తయిన క్రమంలో నిర్వహిస్తున్న ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం ద్వారా బొడ్డు చింతలపల్లి గ్రామం ఆధ్యాత్మిక సౌరభాన్ని సంతరించుకుంది. గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబ సభ్యుడు ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని తమ భక్తి భావాన్ని చాటుతున్నారు. శివనామ కీర్తనలు, శ్రీరామ కీర్తనలతో గ్రామంలోని మైకులు ద్వారా దైవ భావాన్ని ప్రతిధ్వనింప చేస్తున్నాయి. గ్రామంలో ఆలయం నుంచి పురవీధుల వరకు కాషాయపు జెండాలను ఏర్పాటు చేసి దైవ భావన ప్రతి ఒక్కరిలో మేలవించేలా దేవస్థాన కమిటీ ఏర్పాటు చేసింది.

**- ఆదివారం విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవం**

ఆదివారం రోజు దేవాలయాల



ప్రారంభోత్సవంలో శిఖరాగ్ర ఘట్టం ప్రారంభమవుతుంది. విగ్రహాల ప్రాణ ప్రతిష్ట తో పాటు ధ్వజ స్తంభ ప్రతిష్టాపన ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శ్రీ రామ క్షేత్ర దేవాలయ కమిటీ ఏర్పాట్లు సిద్ధం చేసింది. విగ్రహాల ప్రాణప్రతిష్ట ధ్వజ స్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం అనంతరం గ్రామస్తులు అందరికీ మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసింది.

# ఎన్ కౌంటర్ల పేరిట ఇంకెంత కాలం నరమేధం..?

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**



చత్తీస్ గఢ్ రాష్ట్రంలో ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నరమేధం ఇంకెంత కాలం కొనసాగిస్తారని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటి పాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మావోయిస్టు పార్టీ నాయకత్వం కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధమని పదేపదే ప్రకటించినప్పటికీ చర్చలకు సరైన వాతావరణం కల్పించకుండా పెడచెవిన పెట్టి దారుణ మారణకాండకు పాల్పడడం దుర్మార్గమన్నారు. వివిధ రాజకీయ పార్టీలు, వామ పక్ష పార్టీలు ప్రజా సంఘాలు మేధావులు అనేకమంది కేంద్ర ప్రభుత్వానికి ఆపరేషన్ కగార్ నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసిన కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యమన్నారు. ఇటీవల కాలంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు తో సహా వందలాది మందిని, మొన్న కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ ను, నిన్న తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ లను ఎన్ కౌంటర్ పేరుతోకాల్చి చంపారని ప్రతినిత్యం ఎన్ కౌంటర్ వార్తలు వస్తూనే ఉన్నాయన్నారు. శవాలను సైతం కుటుంబ సభ్యులకు అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి ఇవ్వడం లేదంటే ఇంతకంటే దారుణం ఇంకేమి ఉంటుందన్నారు. ఏసమస్యలకైనా కాల్చి చంపడం పరిష్కార మార్గం కాదని, చర్చల ద్వారానే ఎంతటి సమస్యలైన పరిష్కారం అవుతాయన్నది చరిత్ర నేర్పిన సత్యమన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరిని వీడి కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ముందుకు రావాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.

# సహృదయత చాటుకున్న చింతలపల్లి గ్రామస్తులు




**వేద న్యూస్ , ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మండల పరిధిలోని చింతలపల్లి గ్రామ ప్రజలు తమ సహృదయతను చాటుకున్నారు. వివరాల్లోకెళితే.. గ్రామానికి చెందిన వృద్ధురాలు కందుకూరి తిరుపతమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కందుకూరి తిరుపతమ్మ కొడుకు వీరభద్రయ్య కుటుంబం కూలినాలి చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఆర్థికంగా వెనుకబడిన వీరభద్రయ్య ఫ్యామిలీకి చింతలపల్లి గ్రామ ప్రజలు అండగా నిలిచారు. తమ వంతుగా తలా కొంత డబ్బులు పోగు చేసుకుని తిరుపతమ్మ అంత్యక్రియల నిర్వహణ నిమిత్తం రూ.10,500 కలెక్ట్ చేశారు. ఆ డబ్బులను దహన సంస్కారాల కోసం అందజేశారు. తోటి ఊరి ప్రజలు తమకు అండగా నిలిచి.. ఐక్యతను చాటడం మంచి విషయమని పలువురు అభిప్రాయపడ్డారు.

# తిరుపతమ్మ దీవెనలతో గ్రామం సుభిక్షంగా ఉండాలి

**- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



తిరుపతమ్మ గోపయ్య స్వామి దీవెనలతో లక్ష్మీదేవి గూడెం గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అభిప్రాయపడ్డారు. లక్ష్మీదేవి గూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుపతమ్మ గోపయ్య స్వామి విగ్రహ ప్రతిష్ట లో సల్కునూరు సహకార సంఘం చైర్మన్ గడ్డం స్పూరధర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతమ్మ గోపయ్య స్వామి దీవెనలు గ్రామ ప్రజలందరికీ ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా పడి రైతుల ముఖంలో ఆనందం నిండాలని అన్నారు. అంతకుముందు ఈ తిరుపతమ్మ గోపయ్య స్వామి దాతల సహకారంతో నిర్మించడం అమోఘమని కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మాజీ సర్పంచ్ పేరాల కృపాకర్ రావు, గురువా రావు, బిక్షం, వెంకట్ నారాయణ, సుమన్, సైదులు, రామలింగారావ్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం మిర్యాలగూడ మండల పరిధిలో వివిధ వార్డులకు చెందిన 300 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ ,షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో పలువురు అధికారులు,మండల నాయకులు, గ్రామ నాయకులు, పట్టణ నాయకులు , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన పోస్టు.. తొలగించిన ఎలాన్ మస్క్




**వేద న్యూస్, డెస్క్:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మధ్య గురువారం సోషల్ మీడియా వేదికగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్స్టీన్ పేరు తెరపైకి రావడం అమెరికా రాజకీయాల్లో కలకలం రేపింది. ఎప్స్టీన్ కేసు ఫైల్స్‌లో డొనాల్డ్ ట్రంప్ పేరు ఉందని, అందుకే ఆ ఫైల్స్ ను బయటపెట్టడం లేదని మస్క్ సంచలన ఆరోపణలు చేశారు. అయితే, ఆ పోస్ట్‌ను మస్క్ తొలగించడం గమనార్హం. ఎలాన్ మస్క్ తన 'ఎక్స్' ఖాతాలో, "ఎప్స్టీన్ ఫైల్స్‌లో డొనాల్డ్ ట్రంప్ పేరు ఉంది. అందుకే వాటిని ఇప్పటివరకు బయటపెట్టలేదు. శుభం కలుగుగాక, డీజేటీ!" అంటూ ట్రంప్‌ను ఉద్దేశించి పోస్ట్ చేశారు. ఇప్పుడు ఈ పోస్ట్‌ను డిలీట్ చేశారు. అంతకుముందు, గురువారం జరిగిన సోషల్ మీడియా పోరులో, "ఈ పోస్ట్‌ను భవిష్యత్తు కోసం గుర్తుపెట్టుకోండి, నిజం బయటకు వస్తుంది" అని కూడా మస్క్ పేర్కొన్నారు.

ట్రంప్ "బిగ్ బ్యూటిఫుల్ బిల్" విషయంలో ఆయనతో విభేదించి, ప్రభుత్వ సలహాదారు పదవికి రాజీనామా చేసిన మస్క్, ప్రభుత్వ సామర్థ్య విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ) బాధ్యతల నుంచి తప్పుకుని తన వ్యాపారాలపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ట్రంప్‌తో ఆయనకు విభేదాలు తలెత్తాయి. "నేను లేకపోతే, ట్రంప్ ఎన్నికల్లో ఓడిపోయేవారు, డెమొక్రాట్లు హౌస్‌ను నియంత్రించేవారు. సెనేట్‌లో రిపబ్లికన్ల బలం 51-49 వరకు ఉండేది" అని మస్క్ పేర్కొన్నారు. ఎలాన్ తనపై విమర్శలు చేయడంపై ట్రంప్ కూడా ఘాటుగానే స్పందించారు.

# కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల సంక్షేమం సాధ్యం

## – ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వేద న్యూస్,నర్సంపేట :**

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందన్నారు.శనివారం రెడ్లవాడ గ్రామం, పిట్టకాయల బోర్డ్ తండ గ్రామాలలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిర మైండ్లను మంజూరు చేసి వారి ఇంటి నిర్మాణాలు పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు అన్నారు. పైగా కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన ఇందిరమ్మ ఇల్లు చిన్నగా ఉన్నాయని అల్లుడు బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారు కోళ్లను ఎక్కడ కమ్మాలే అని అవహేళన చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోయినా కెసిఆర్ చేసిన అప్పులకు మిత్తిలి కట్టలేక ఇబ్బందులు పడుతున్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలయి శ్రీనివాస్ నెక్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల వి ప్రసాద్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లావుడియా తిరుమల్, మండల కాంగ్రెస్ నాయకులు ఈదునూరి సాయి కృష్ణ, కుసుమ, చెన్నకేశవులు, నర్సంపేట కోర్ట్ ఏజిపి బండి శివకుమార్, పోలి శెట్టి భాను ప్రకాష్, చల్ల పాపిరెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగం ప్రశాంత్, మార్కెట్ డైరెక్టర్లు మహిపాల్ రెడ్డి, దూదిమెట్ల కొమురయ్య, ఆవుల శ్రీనివాస్, రెడ్లవాడ మాజీ ఎంపీటీసీ రవి, కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల రాజు, దూదిమెట్ల రాజు, గడదాస్ వేణుగోపాల్, మాజీ ఉపసర్పంచ్ బర్ల వీరభద్రం, వేణు భద్రయ్య యాదగిరి, వెంకట్రాం సూర్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ యూనివర్సిటీలో గ్రాండ్ సక్సెస్ మీట్

## – 1200 మందికి పైగా విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక – రూ.51 లక్షల వార్షిక ప్యాకేజీతో అత్యధిక జీతం

**వేద న్యూస్, వరంగల్ జిల్లా:**




విద్యార్థుల ఉద్యోగ విజయాలను పురస్కరించుకుంటూ ఎస్ ఆర్ యూనివర్సిటీ ప్రాంగణంలో గ్రాండ్ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా విశ్వవిద్యాలయం పరిశ్రమలతో ఉన్న బలమైన అనుసంధానాన్ని, విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన శిక్షణను మరియు కెరీర్ అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను ప్రతిబింబించింది. ఈ సందర్భంగా చాన్సలర్ ఏ. వరధ రెడ్డి మాట్లాడుతూ, “ఈ విజయాలు పరిశ్రమ అవసరాలను గుర్తించి, విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించిన ఫలితంగా సాధ్యమయ్యాయి. వారి ఆసక్తులను ప్రోత్సహిస్తూ అన్ని కోణాల్లో వారిని అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. ఈ విజయాల్లో కీలకంగా పనిచేసిన డీన్లు, శాఖాధిపతులు, డైరెక్టర్లు, ప్లేస్‌మెంట్ సమన్వయకర్తలు అందరి కృషిని అభినందిస్తున్నాను,” అని పేర్కొన్నారు.

వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ, “ప్లేస్‌మెంట్ విజయాలతో పాటు, విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించేందుకు అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో మేము ఎమ్ ఓ యు లు కుదుర్చుకున్నాం. అలాగే మా ఎస్ ఆర్ ఐ ఎ్స ఇంక్యుబేషన్ కేంద్రందా్వారా విద్యార్థుల స్టార్టప్ ఆలోచనలకు సీడ్ ఫండింగ్ ద్వారా మద్దతు అందిస్తున్నాము. ఈ దిశగా కృషి చేసిన డీన్లు, ప్లేస్‌మెంట్ బృందం, ఉపాధ్యాయుల సహకారానికి కృతజ్ఞతలు,” అని తెలిపారు. కాగా అసోసియేట్ డైరెక్టర్ %–% ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ జి. సునీల్ రెడ్డి ఈ విద్యా సంవత్సరానికి గల ప్లేస్‌మెంట్ నివేదిక ను సమర్పించారు. ఈ సంవత్సరం 1200 మందికి పైగా విద్యార్థులు వివిధ ప్రఖ్యాత సంస్థలలో ఉద్యోగాలకు ఎంపిక కావడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని తెలిపారు. ఆయన వివరించగా, ఈ ఏడాది ఎస్ ఆర్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శించిన సంస్థలలో మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, సర్వీస్‌నౌ, పేపాల్, ఫ్లిప్‌కార్ట్ నీవ్, ష్నైడర్ ఎలక్ట్రిక్, ఇన్ఫోసిస్, కాప్జెమిని, యాక్సెంచర్, కాగ్నిజెంట్, హ్యూండాయ్, బోష్, టోషిబా, టెక్ మహీంద్రా వంటి ప్రఖ్యాత మల్టీనేషనల్ సంస్థలు ఉన్నాయి.

ఈ సంవత్సరం విద్యార్థులు అందుకున్న అత్యధిక జీత ప్యాకేజీలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వార్షికంగా రూ. 51 లక్షలు, రూ. 44 లక్షలు, రూ. 34.4 లక్షల జీత ఆఫర్లు లభించడం విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలను కల్పించడంపై ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా చాన్సలర్ వరధ రెడ్డి,వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. అర్చనా రెడ్డి,కలిసి ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థులకు అభినందన పత్రాలు మరియు ఆఫర్ లెటర్లు అందజేశారు. వారు విద్యార్థుల ప్రతిభ, శ్రమ మరియు సాధనను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ వి. మహేష్ విభిన్న స్కూళ్ల డీన్లు,శాఖాధిపతులు, ఉపాధ్యాయులు,ప్లేస్‌మెంట్ టీమ్,ప్లేస్‌మెంట్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులుపాల్గొని వేడుకను మరింత గౌరవభరితంగా, స్ఫూర్తిదాయకంగా మార్చారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు సెలక్షన్స్

## – సెలెక్ట్ అయినా పలువురు క్రీడాకారులు

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



ఉమ్మడి నల్గొండ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో సెలక్షన్స్ నిర్వహించడం జరిగింది.ఇట్టి సెలక్షన్స్ లో అండర్ 17 క్యాటగిరి గర్ల్స్ మరియు బాయ్స్ పాల్గొనడం జరిగింది.ఈ సెలక్షన్స్ లో ఉత్తీర్ణులైన బాక్సింగ్ ప్లేయర్స్ నిజాంబాద్ లో జరగబోయేటటువంటి రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో పాల్గొనడం జరుగుతున్నది. ఉత్తీర్ణత సాధించిన ప్లేయర్స్ వివరాలు ఏ.గోకుల్,ఏ.గౌతమ్,వంశీ,గుణాకర్,హనీష్,టి.మనీ సింహారెడ్డి,జి.హర్ష గర్ల్స్ విభాగంలో ఏ.నిహారిక సెలెక్ట్ అయ్యారు.ఈ సెలక్షన్స్ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ ఈ.రవీందర్ గౌడ్,గణేష్,నరేష్,శ్రీచరణ్,సిద్దిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# బెంగళూరు తొక్కిసలాట ఘటన.. సీఐడీకి అప్పగింత

**వేద న్యూస్, బెంగళూరు:**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ విజయోత్సవం సందర్భంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందిన ఘటనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ దర్యాప్తునకు కర్ణాటక ప్రభుత్వం శనివారంనాడు ఆదేశించింది. వెంటనే రంగంలోకి దిగిన సీఐడీ టీమ్ కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ కార్యాలయానికి వెళ్లి ప్రాథమిక సమాచారాన్ని సేకరిస్తోంది. కాగా, చిన్న స్వామి స్టేడియంలో జరిగిన తొక్కిసలాటకు నైతిక బాధ్యత వహిస్తూ కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) కార్యదర్శి ఎ.శంకర్, కోశాధికారి ఈఎస్ జైరామ్ తమ పదవులకు శనివారంనాడు రాజీనామా చేసారు. బోర్డు ప్రెసిడెంట్ రఘురామ్ భట్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. స్టేడియంలో ఈవెంట్ నిర్వహణకు ఆర్‌సీబీని తాము అనుమతించ లేదని పోలీసులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో ఈర్‌సీబీని ప్రధాన నిందితుడిగా పేర్కొంది. దీనితో పాటు ఫ్రాంచైజ్ ఈవెంట్ పార్టనర్ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్, స్టేడియం కంట్రోల్ బాధ్యతలపై కేఎస్‌సీఏ పేర్లు కూడా చేర్చారు. ఈ కేసులో అరెస్టు చేసిన నలుగురిని 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి కోర్టు ఆదేశించింది. వీరిలో ఆర్సీబీ మార్కెటింగ్ అండ్ రెవెన్యూ హెడ్ నిఖిల్ సోసలే కూడా ఉన్నారు. తొక్కిసలాట ఘటన అనంతరం కుబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమైదింది. దీనిపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ సారథ్యంలో ఏక సభ్య దర్యాప్తు కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మరోవైపు, ఈ ఘటనను హైకోర్టు సుమోటోగా తీసుకుని స్థాయీ నివేదికను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జూన్ 10న కేసు విచారణను చేపట్టనుంది.

# అసమానతలు లేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యం




**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

వేములపల్లి మండల కేంద్రములో సిపిఐ పార్టీ ఏడవ మహాసభ జిల్లాయాదగిరి అధ్యక్షతన జరిగింది.ఈ మహాసభ కు సిపిఐ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్ల వెంకటరెడ్డి,సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్థిక సమనత్వం కోసం ఒక మనిషిని ఒక మనిషి దోపిడీ చేయని సమ సమాజ పరిణామ స్థాపన కోసం సిపిఐ పార్టీ పోరాటాలకు సిద్ధం కావాలని వారన్నారు.భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల సుదీర్ఘమైనటువంటి చరిత్ర కలిగినటువంటి పార్టీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తున్న పార్టీ సిపిఐ పార్టీ అని గుర్తు చేశారు.పెట్టుబడి దారులు,దోపిడీదారుల వల్ల సమాజంలో అసమానతలు విపరీతంగా పెరిగి ధనికులు మరింత ధనికులుగా,పేదవాళ్లు మరింత పేదవాళ్లుగా ఆర్థిక అంతరాలు పెరిగిపోయి పేదరికం సమాజంలో విలయ తాండవం

చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క లక్షణాలు అసమానతలు పెంచుకోనీ పోషిస్తుందని,ఈ విధానాలకు ప్రత్యామ్నాయంగా ఈ సమాజంలో అసమానతలు పోవాలంటే దోపిడి పోవాలంటే అసమానతలు లేని దోపిడీ లేని వ్యవస్థ రావాలంటే అది కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. అసమానతలు లేని సమాజం సోషలిస్ట్ వ్యవస్థ నిర్మాణం కోసం పోరాటం తప్పదని,సోషలిజం సమ సమాజం కోసం అవిశ్రాంత పోరాటం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ నిర్వహిస్తుందని,పేదల తరపున కష్టజీవుల తరుపున నిరంతరం ఉద్యమాలు నిర్వహించి అసమానతలు లేని సమాజం కోసం పేదల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలు చేస్తామని తెలిపారు.చరిత్ర కమ్యూనిస్టుల సొంతమని నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు ఉద్యమాలలో ప్రజలు అధిక సంఖ్యలో మరింత చైతన్యవంతంగా పాల్గొనాలని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను తెప్పి కొట్టాలని వారు కోరారు. సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కి విజ్ఞప్తి చేశారు. రాబోయే స్థానిక సమస్త ఎన్నికలలో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించడం కృషి చేయాలని కోరారు.ఈ మహాసభలో సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు మద్దిరాల రంగారెడ్డి, మిర్యాలగూడ మండల కార్యదర్శి అంజన్నపల్లి రామలింగం,దామర చర్ల మండల సహాయ కార్యదర్శి శాంతమ్మ,ఉదయ్,జిల్లాల శ్రీనివాస్ రెడ్డి,మద్దిరాల వెంకటరెడ్డి,పుట్టల నాగయ్య, పుట్టల కృష్ణ,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రనాయకులు వల్లంపట్ల ఎంకన్న, మున్నయ్య, ప్రజానాట్యమండలి నియోజకవర్గ నాయకులు వెంకన్న, ఒలంపట్లసుధాకర్ పాల్వాయి సుధాకర్,పుట్టల జయ, మాతంగిసత్యం ,బసక పరమేశు,దాసరిలింగయ్య,పెదపంగా ఆనందం,జిల్లాఆనందం,జిల్లా ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ రిగ్గింగ్ వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ ఆగ్రహం

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యల్లో చిక్కుకున్నారు. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అసాధారణ విజయం సాధించేందుకు మ్యాచ్ ఫిక్సింగ్ వ్యూహాన్ని బీజేపీ అనుసరించిందని, త్వరలో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ పునరావృతం కానుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాహుల్ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని, చట్ట పాలనను అవమానించడమేనని పేర్కొంది. రాహుల్ దీనికి ముందు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ నియామకం కోసం ప్యానల్ రిగ్గింగ్‌తో ప్రారంభించి అవకతవకల సాక్ష్యాలను దాచిపెట్టడంతో ఐదంచెల్లో మ్యాచ్ ఫిక్సింగ్ వ్యూహాన్ని బీజేపీ మహరాష్ట్రలో అనుసరించిందని అన్నారు. వంచనకు పాల్పడిన వారు గెలవచ్చేమో కానీ ఇలాంటి పద్ధతుల వల్ల ప్రజాస్వామ్యం బలహీనపడి, వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం పోతుందని చెప్పారు. రాహుల్ వ్యాఖ్యలపై అంతే వేగంగా ఎన్నికల కమిషన్ స్పందించింది. రాహుల్ వ్యాఖ్యలు అసంబద్ధమని, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఒక ప్రకటనలో ఆక్షేపణ తెలిపింది. ఎన్నికల కమిషన్ డిసెంబర్ 2024న ఇందుకు సంబంధించిన వాస్తవాలను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు తెలియజేసిందని, దానిని ఈసీఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిందని తెలిపింది. సాక్ష్యాలు లేకుండా పదేపదే ఎవరు ఆరోపణలు చేసినా వారికి చట్టం పట్ల వారికి గౌరవం లేదనే అభిప్రాయానికి తావిస్తుందని, నిష్పాక్షిక ఎన్నికల కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్న ఎన్నికల సిబ్బంది నైతికస్థైరాన్ని దెబ్బతీస్తుందని ఘాటుగా విమర్శించింది.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన మ్యాచ్ ఫిక్సింగ్ బీహార్‌కు రాబోతోందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తిప్పికొట్టింది. రాహుల్ వ్యాఖ్యలు హుందాగా లేవని, దేశ ప్రజాస్వామిక సంస్థలను బలహీనపరుస్తూ మాట్లాడటం ఆయనకు అలవాటుగా మారిందని ఆ పార్టీ ప్రతినిధి తుహిన్ సిన్హా అన్నారు.

వేద న్యూస్
ఆదివారం జూన్ 08, 2025

# 30 రోజుల్లో నాలుగో ఘటన!

మొదటిపేజీ తరువాయి

ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. గడిచిన నెల రోజుల వ్యవధిలో చార్‌ధామ్ మార్గంలో ఇది నాలుగో హెలికాప్టర్ సంబంధిత ఘటన కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం సిర్సి హెలిప్యాడ్ నుంచి ఐదుగురు యాత్రికులతో ఒక ప్రైవేట్ హెలికాప్టర్ కేదార్‌నాథ్‌కు బయల్దేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే, బడాసు ప్రాంతంలో హెలికాప్టర్‌ను అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో హెలికాప్టర్ తోక భాగం విరిగిపోయింది. అయితే, ఈ ఘటనలో ఐదుగురు యాత్రికులతో సహా ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. ఫాటా, గుప్తకాశీలతో పాటు సిర్సి హెలిప్యాడ్ నుంచి కూడా కేదార్‌నాథ్‌కు యాత్రికులను హెలికాప్టర్ల ద్వారా చేరవేస్తుంటారు.

ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. “సిర్సి నుంచి ప్రయాణికులతో బయల్దేరిన హెలికాప్టర్, హెలిప్యాడ్‌కు బదులుగా రోడ్డుపై ముందుజాగ్రత్త చర్యగా ల్యాండ్ అయిందని ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూసీఏడీఏ) సీఈఓ తెలియజేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు సమాచారం అందించాం. మిగిలిన కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతున్నాయి” అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, గత 30 రోజుల్లో చార్‌ధామ్ యాత్రా మార్గంలో ఇది నాలుగో హెలికాప్టర్ ప్రమాదం. మే 8వ తేదీన గంగోత్రి సమీపంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు మరణించారు. మే 12న బద్రీనాథ్ హెలిప్యాడ్ వద్ద ఒక హెలికాప్టర్ రెక్క అక్కడే ఉన్న వాహనాన్ని తాకడంతో ప్రమాదం తృటిలో తప్పింది. ఇక మే 17న కేదార్‌నాథ్ ప్రాంతంలో ఉదయం సుమారు 11:50 గంటలకు ల్యాండ్ అవుతున్న సమయంలో ఒక ఎయిర్ అంబులెన్స్ తోక భాగం నేలను తాకడంతో ప్రమాదానికి గురైంది. ఆ ఘటనలో పైలట్, ఒక వైద్యుడు, నర్సింగ్ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. వరుస ఘటనల నేపథ్యంలో యాత్రికుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# రూ.151 కోట్ల భారీ విరాళం ఇచ్చిన ముఖేశ్ అంబానీ

అభివృద్ధికి ఏ విధంగానైనా ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు. విఖ్యాత రసాయన శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎంఎం శర్మ జీవిత చరిత్ర ఆధారంగా రూపుదిద్దుకున్న ‘డివైన్ సైంటిస్ట్’ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ముఖేశ్ అంబానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విరాళం తన గురువు ప్రొఫెసర్ శర్మకు ఇచ్చే గురుదక్షిణ అని పేర్కొన్నారు. ముఖేశ్ అంబానీ 1970వ సంవత్సరంలో ఐసీటీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రులయ్యారు. ఆ రోజుల్లో ఈ సంస్థను యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (యూడీసీటీ)గా పిలిచేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. సుమారు మూడు గంటలకు పైగా ఐసీటీ ప్రాంగణంలో గడిపిన అంబానీ, యూడీసీటీలో తన విద్యార్థి దశ జ్ఞాపకాలను, ప్రొఫెసర్ శర్మతో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ప్రొఫెసర్ శర్మ దార్శనికత వల్లే భారత ఆర్థిక వ్యవస్థలో కీలక సంస్కరణలకు బీజం పడిందని అంబానీ అభిప్రాయపడ్డారు. “భారత పరిశ్రమను లైసెన్స్ పర్మిట్ రాజ్ కబంధ హస్తాల నుంచి విడిపిస్తేనే దేశం పారిశ్రామికంగా పురోగమిస్తుందని, ప్రపంచ దేశాలతో పోటీ పడగలదని ప్రొఫెసర్ శర్మ బలంగా నమ్మేవారు. ఈ విషయాన్ని అప్పటి పాలకులకు అర్థమయ్యేలా చెప్పడంలో ఆయన విజయం సాధించారు,” అని అంబానీ వివరించారు. తన తండ్రి, రిలయన్స్ వ్యవస్థాపకులు ధీరూబాయ్ అంబానీ కూడా దేశ పారిశ్రామిక ప్రగతి కోసం ఎలా తపించేవారో, అదే ఆకాంక్ష ప్రొఫెసర్ శర్మలో కూడా కనిపించేదని ఆయన అన్నారు. ప్రొఫెసర్ శర్మను ‘గురు ఆఫ్ భారత్’గా అభివర్ణిస్తూ, ఆయన సేవలకు గుర్తింపుగా ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు ముఖేశ్ అంబానీ సభాముఖంగా తెలిపారు.

# భారీ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి

మావోయిస్టులు ఉన్నారు. ఘటనాస్థలిలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. యాంటీ-నక్సల్ ఆపరేషన్‌లో భాగంగా బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇప్పటివరకు, బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ ప్రాంతంలో కొనసాగుతున్న యాంటీ-నక్సల్ ఆపరేషన్ల సమయంలో భద్రతా దళాలు మొత్తం ఏడు మావోయిస్టు కార్యకర్తల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో కేంద్ర కమిటీ సభ్యుడు గౌతమ్ అలియాస్ సుధాకర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ మృతదేహాలు ఉన్నాయి.



# నేను ఆపకుంటే భారత్-పాక్ మధ్య అణుయుద్ధం జరిగేది

**వేద న్యూస్, డెస్క్:**



భారత్, పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో తాను జోక్యం చేసుకుని అణు యుద్ధం సంభవించకుండా ఆపగలిగానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వాణిజ్యపరమైన ఒత్తిడి తీసుకురావడం ద్వారానే ఇరు దేశాల మధ్య ఘర్షణలు ఆగిపోయాయని ఆయన పేర్కొన్నారు. ఆశ్చర్యకరంగా, ట్రంప్ వాదనలకు రష్యా నుంచి మద్దతు లభించగా, భారత అధికారులు మాత్రం ఈ మధ్యవర్తిత్వ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఈ విషయంపై తమ ఆందోళనలను నేరుగా తెలియజేశారు.

**- ట్రంప్ వ్యాఖ్యలు, రష్యా సమర్థన**

శుక్రవారం ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ, డొనాల్డ్ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. “మీకు తెలుసా, నేను ఒక పెద్ద సమస్యను పరిష్కరించాను, దాని గురించి ప్రజలు ఎక్కువగా మాట్లాడరు, నేను కూడా ఎక్కువగా చెప్పను. కానీ భారత్, పాకిస్తాన్ మధ్య అణు సమస్యను, బహుశా అణుయుద్ధాన్ని నివారించాను. నేను పాకిస్తాన్‌తో మాట్లాడాను, భారత్‌తో మాట్లాడాను, వారికి గొప్ప నాయకులు ఉన్నారు, కానీ వారు తీవ్రంగా ఘర్షణ పడుతున్నారు, అది అణుయుద్ధానికి దారితీసేది,” అని ట్రంప్ తెలిపారు. ఘర్షణలు కొనసాగితే అమెరికాతో వాణిజ్యం నిలిపివేస్తామని హెచ్చరించిన తర్వాతే ఇరు దేశాలు దాడులు ఆపాయని ఆయన వివరించారు.

**- భారత్ తీవ్ర అభ్యంతరం**

అయితే, అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలు దౌత్యపరమైన ప్రతిఘటనకు దారితీశాయి. అమెరికాలో పర్యటిస్తున్న అఖిలపక్ష ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్, ట్రంప్ మధ్యవర్తిత్వ వాదనలను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వద్ద నేరుగా ప్రస్తావించినట్లు తెలిపారు. “ఉపాధ్యక్షుడు వాన్స్‌తో సమావేశం అద్భుతంగా, చాలా స్పష్టంగా జరిగింది. మధ్యవర్తిత్వం అనే ఈ ప్రశ్నకు మా వైఖరిని స్పష్టంగా తెలియజేశామని నేను భావిస్తున్నాను, ఉపాధ్యక్షుడు వాన్స్ మా వాదనలను పూర్తిగా అర్థం చేసుకున్నారు,” అని థరూర్ వివరించారు.

# కాళేశ్వరం వివాదంలోకి నన్ను అనవసరంగా లాగుతున్నారు

మొదటి పేజీ తరువాయి

సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన తర్వాతే కమిషన్ వేశారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై గతంలో తాను ఛైర్మన్‌గా ఉన్న సబ్ కమిటీ ఎప్పుడూ నివేదిక ఇవ్వలేదని తుమ్మల తెలిపారు. కేవలం ప్రాణహిత ప్రాజెక్టుపై మాత్రమే అప్పటి పరిస్థితులకు అనుగుణంగా స్టేటస్ రిపోర్ట్ ఇచ్చామని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై మాత్రమే తెలంగాణ ప్రభుత్వం కమిషన్ వేసిందని, ఈ విషయంలో పూర్తి వివరాలను తాను సుమోటోగా కమిషన్ దృష్టికి తీసుకెళతానని మంత్రి ప్రకటించారు.

# తెలంగాణ విమాన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం

మొదటి పేజీ తరువాయి

వెల్లడించారు. రఫేల్ యుద్ధ విమానాల తయారీకి సంబంధించి ఫ్రాన్స్ వెలుపల ఇటువంటి అత్యాధునిక విడిభాగాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. ఈ ఒప్పందం ద్వారా రఫేల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఫ్యూసిలేజ్‌లను హైదరాబాద్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఉత్పత్తి చేయనుంది. ఈ పరిణామం తెలంగాణలో విమాన తయారీ పరిశ్రమ విస్తరణకు, దేశీయ సంస్థలు తమ తయారీ సామర్థ్యాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడానికి దోహదపడుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రపంచ రక్షణ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థలో భారత్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోనుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**- రక్షణ ఎగుమతులలో భారత్ ప్రగతి**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రక్షణ ఎగుమతులు గణనీయంగా వృద్ధి చెందాయని కిషన్ రెడ్డి తెలిపారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ. 686 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 2024-25 నాటికి రూ. 23,622 కోట్లకు చేరాయని ఆయన వివరించారు. ప్రస్తుతం భారత్ 80కి పైగా దేశాలకు రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని, ఇది దేశానికి గర్వకారణమని అన్నారు.

**- దిగుమతుల నుంచి ఎగుమతుల వైపు ప్రస్థానం**

“ఒకప్పుడు మనం దిగుమతి చేసుకునేవాళ్ళం, కానీ ఇప్పుడు మనమే తయారు చేస్తున్నాం, మనమే ఎగుమతి చేస్తున్నాం” అంటూ భారత్ సాధిస్తున్న ప్రగతిని కిషన్ రెడ్డి కొనియాడారు. భారత్ విశ్వసనీయమైన ప్రపంచ రక్షణ ఉత్పత్తి కేంద్రంగా ఎదుగుతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ఏపీ గ్రీన్ కో ప్రాజెక్టు ఒక అద్భుతం

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. పవర్ స్టోరేజ్ కోసం గ్రీన్ కో ప్రాజెక్టు వాడే టెక్నాలజీ అద్భుతంగా ఉందని, 4 వేల మెగా వాట్స్ సోలార్ పవర్, ఒక వెయ్యి మెగా వాట్స్ విండ్ పవర్, 1680 మెగా వాట్స్ జల విద్యుత్ ఉత్పత్తి చేసి పీక్ అవర్‌లో ఇతర రాష్ట్రాలకు సప్లై చేసేందుకు గ్రీన్ కో ప్రాజెక్టు సంసిద్ధంగా ఉందని భట్టి అన్నారు. గ్రీన్ కో ప్రాజెక్టులు దేశంలో ఇంకా రావాలని, వీటివల్ల దేశ జీడీపీ పెరుగుతుందని భట్టి స్పష్టం చేశారు. కాగా, జనవరిలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిన్నాపురంలోని గ్రీన్‌కో ప్రాజెక్టును సందర్శించారు. పనులను సమీక్షించారు. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్రంతోపాటు దేశానికే మంచిపేరు వస్తుందని అన్నారు. ఇలాంటి సమీకృత ప్రాజెక్టు దేశంలో మరోచోట లేదని పవన్ చెప్పారు. హెలికాప్టర్ ద్వారా గ్రీన్‌కో సోలార్‌పవర్ ప్రాజెక్టును పవన్ పరిశీలించారు.

# మిల్స్ కాలనీ సీఐగా రమేష్ బాధ్యతలు స్వీకరణ

**- జనం మనసులో “బొల్లం” స్థానం పొందేనా? - గత చరిత్రను పక్కనబెట్టి నూతన అధ్యాయం లిఖించాలని పలువురి ఆకాంక్ష**

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని ఏ.జె మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నూతన ఇన్ స్పెక్టర్ గా శనివారం బొల్లం రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహించిన వెంకటరత్నం సస్పెండ్ కావడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ బొల్లం రమేష్ కు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలను స్వీకరించారు.

**- ప్రత్యేక శ్రద్ధ వహిస్తే.. చక్కటి పేరు**

గత కొన్ని ఏండ్లుగా మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన వారిలో మెజారిటీ అధికారులు ఏ ఆరోపణ లేకుండా ట్రాన్స్‌ఫర్ కాలేదని చెప్పొచ్చు. సాధారణ బదిలీలో భాగంగా ఈ పీఎస్ నుంచి వెళ్లిన వారు అరుదుగా ఉండటం గమనార్హం. ఈ పీఎస్ ఎస్‌హెచ్‌వోలుగా పని చేసిన ఆఫీసర్లలో ఎక్కువ మంది ఏదో ఒక ఆరోపణ మోస్తూ.. సస్పెండయి వెళ్లిన వారే తప్ప.. నిజాయితీగా పని చేసి బదిలీపై వెళ్లినవారు అరుదు అని చెప్పకతప్పదు.. కాగా నూతనంగా ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన బొల్లం రమేష్.. గత చరిత్రను పక్కనబెట్టి ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలని, ప్రజల అధికారిగా పని చేయాలని జనం ఆకాంక్షిస్తున్నారు. పీఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు లా అండ్ ఆర్డర్ కంట్రోల్ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించి.. జనం మనసులో స్థానం పొందేలా పని చేస్తే..ఈ పీఎస్‌కు చక్కటి పేరు వస్తుందని, నూతన చరిత్ర లిఖితమవుతుందని పలువురు పేర్కొంటున్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073